# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- వైద్యులు రోగులను రక్షించేందుకు అవకాశమున్న అన్ని ప్రయత్నాలు చేస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- దేశ అభివృద్ధి మహిళల ఆరోగ్యం, సాధికారతతోనే సాధ్యపడుతుందని కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి అన్నారు
- నేపాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఇప్పటి వరకూ 192 మంది మరణించారు.
- భారత్ -ఖజీకిస్తాన్ సంయుక్త వైమానిక సైనిక విన్యాసాలు ఈ రోజు ఉత్తరాఖండ్ లో ప్రారంభమయ్యాయి.
- సుస్థిర అభివృద్ధి కోసం నీటి సమాచార కేంద్రాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

= = = = = = = = = = = = = = = = = =

వైద్యులు రోగులను రక్షించేందుకు అవకాశమున్న అన్ని ప్రయత్నాలు చేస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో అటల్ బిహార్ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 10వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. వైద్యులు రోగులకు వీలైనంత మెరుగైన వైద్యాన్ని అందించడానికే కృషి చేస్తారని, కాని కొన్ని ప్రతికూల పరిస్థితుల్లో ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. అలాంటి సందర్భాల్లో రోగులు కుటుంబ సభ్యులు వైద్యులతో దురుసుగా ప్రవర్తించ కూడదని వారికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఏ వైద్యుడైనా రోగికి చికిత్స అందించేందుకు తమ వంతు కృషి చేస్తారని రాష్ట్రపతి పేర్కొంటూ....

(వాయిస్ 39 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

దేశ అభివృద్ధి మహిళల ఆరోగ్యం, సాధికారతతోనే సాధ్యపడుతుందని కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి అన్నారు. ఝార్ఖండ్ రాష్ట్ర గవర్నర్ సంతోష్ కుమార్ గంగావర్ తో కలిసి కేంద్రమంత్రి ఈ రోజు 11 వేల అంగన్వాడీ కేంద్రాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రెండవ విడత పోషణ మాహ్ ముగింపు వేడుకలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ… పోషణ మాహ్ ముఖ్య ఉద్దేశం రక్త హీనత నివారణ అని పేర్కొన్నారు. 'పోషణ్ భీ పఢైభీ' ఆహారపు అలవాట్లు పోషకాహార లోపాన్ని నివారించేందుకు దోహదపడతాయని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరుస్తున్నామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళా సాధికార్తె ధ్యేయంగా మహిళా శిశు సంక్షేమంలో పలు ప్రాజెక్టులకు 3 లక్షల కోట్ల రూపాయలను ప్రకటించారని కేంద్ర మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = =

నేపాల్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మృతుల సంఖ్య 192కు చేరింది. 94 మంది గాయపడగా, మరో 30 మంది గల్లంతయ్యారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తూర్పు, మధ్య నేపాల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి.  భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు, సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న 4,500 మందిని సహాయక బృందాలు కాపాడినట్లు అధికారులు పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న బాధితులకు ఆహారంతో పాటు ఇతర వస్తువులు అందిస్తున్నామని తెలిపారు. కాగా ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం భారతీయ పౌరుల సహాయం కోసం పబ్లిక్ అడ్వైజరీ జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = =

భారత్ -ఖజికిస్తాన్ సంయుక్త 8వ వైమానిక సైనిక విన్యాసాలు 20 24 ఈ రోజు ఉత్తరాఖండ్ లో ప్రారంభమయ్యాయి. రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను చేపట్టేందుకు ఇరు పక్షాల ఉమ్మడి సైనిక సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ ఉమ్మడి విన్యాసాల లక్ష్యం. సెమీ అర్బన్, పర్వత ప్రాంతాలలో కార్యకలాపాలపై ఈ వ్యాయామం దృష్టి సారించనున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉమ్మడి కార్యకలాపాలను నిర్వహించడానికి వ్యూహాలతో పాటు ఉత్తమ అభ్యాసాలను పంచుకోవడానికి ఇది ఇరుపక్షాలను అనుమతిస్తుంది అని మంత్రిత్వ శాఖ తెలిపింది. రక్షణ సహకారాన్ని మెరుగుపరిచి, రెండు సైన్యాల మధ్య స్నేహబంధాన్ని అభివృద్ధి చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = =

సుస్థిర అభివృద్ధి కోసం నీటి సమాచార కేంద్రాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. నీటి వనరుల నిర్వహణ, సుస్థిర అభివృద్ధి కోసం భాగస్వాములందరికీ విలువ ఆధారిత ఉత్పత్తులు, సేవలను అందించడానికి నేషనల్ వాటర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ తరహాలో స్టేట్ వాటర్ ఇన్ఫర్మేషన్ సెంటర్  ఏర్పాటుకు ఆ రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది. 9 మంది సభ్యులతో కూడిన ఎస్డబ్ల్యూఐసీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో వివిధ శాఖల కార్యదర్శులు, జలవనరుల శాఖ నిపుణులు ఉంటారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ఆరోగ్య పర్యాటక రంగంలో భారతదేశానికి ప్రత్యేక స్థానం కల్పిస్తున్నాయని ఆయుష్ మంత్రిత్వ శాఖ కేంద్ర సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ ఉద్ఘాటించారు. ఈరోజు ముంబైలో 'ఆయుష్ మెడికల్ వాల్యూ ట్రావెల్ సమ్మిట్'ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ… భారతదేశ ఆరోగ్య పర్యాటకం కేవలం శారీరక ఆరోగ్యంపై దృష్టి పెట్టడమే కాకుండా మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాని కూడా ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఆయుష్ పద్ధతులు, సాంప్రదాయ చికిత్సలు సమిష్టిగా సంపూర్ణ ఆరోగ్య సేవల ప్రమాణాన్ని ఏర్పరుస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది విదేశీ సందర్శకులు ఆయుర్వేద చికిత్స కోసం భారతదేశానికి వస్తున్నారని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = =

భారత్- బంగ్లాదేశ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు ఆసక్తికరంగా మారింది. వర్షం కారణంగా గత రెండు రోజుల ఆట పూర్తిగా రద్దయింది. ఎట్టకేలకు ఈరోజు వాతావరణం సహకరించడంతో  నాలుగో రోజు ఆట సాధ్యమైంది. ఈరోజు ఆటను పునఃప్రారంభించిన బంగ్లాదేశ్ 233 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ దిగిన భారత్ 285 పరుగులు డిక్లేడ్ చేసింది. బంగ్లా రెండో ఇన్నింగ్స్ లో 26 పరుగులు చేసి 2 వికెట్లు నష్టపోవడంతో 26 పరుగుల వెనుకంజలో ఉంది. రేపు ఒక్క రోజే రెండవ టెస్టులో ఆట మిగిలి వుంది.

= = = = = = = = = = = = = = = = = =

అమెరికాలోని ఫ్లోరిడాలో హెలెన్ తుపాను కారణంగా ఇప్పటి వరకు 116 మంది చనిపోయారు. నిన్న సాయంత్రం వరకు ఒక్క బుంకోంబ్ కౌంటీలోనే 30 మంది మరణించారని నార్త్ కరోలినా అధికారులు తెలిపారు.హెలెన్ హరికేన్ వరదల కారణంగా 2.7 మిలియన్ల మంది ప్రజల జనజీవనం స్థంబించడంతోపాటు వేలాది మంది ఆగ్నేయ అమెరికా ప్రాంతంలో చిక్కుకుపోయారని స్థానిక అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = =

“మేక్ ఇన్ ఇండియా” కార్యక్రమాన్ని బలోపేతం చేసేందుకు వాణిజ్య వ్యాపార మంత్రిత్వ శాఖ వ్యాపార సంస్కరణల కార్యాచరణను ప్రవేశపెట్టనుంది. దేశవ్యాప్తంగా అపరిమితమైన వ్యాపార నియంత్రణతో సులభతర వాణిజ్యాన్ని మెరుగు పరిచే దిశగా  ఆమంత్రిత్వ శాఖ చర్యలు చేపడుతోంది. భారత్ ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా మార్చడానికి డిజిటల్ పరిష్కారాల ప్రక్రియ సులభతరం కానుంది.

= = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తిని దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఆయన అందించిన సేవలకు గానూ..  కేంద్ర ప్రభుత్వం 55వ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో సత్కరించింది. తన బహుముఖ ప్రదర్శనలతో సినీ అభిమానులు మిథున్ చక్రవర్తిని తరతరాలుగా మెచ్చుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. దీనిపై స్పందిస్తూ... ఈ అవార్డు ప్రధానం చేయడంపై మిథున్ చక్రవర్తి కృతజ్ఞతలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = =

ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ ఈ రోజు నూతన భారత వైమానిక దళం అధిపతిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అమర్ ప్రీత్ సింగ్ సుమారు 40  సంవత్సరాలుగా అనేక పదవు ల్లో పనిచేశారు. అలాగే  అంతర్జాతీయ స్థాయిలోను అనేక విమాన పరీక్షల పదవుల్లోనూ విధులు నిర్వహించారు. ఎయిర్ చీఫ్ మార్షల్ వి.ఆర్.చౌదరి స్థానాన్ని భర్తీ చేస్తూ ఆయన ఈరోజు నూతన పదవి చేపట్టారు.

= = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 26 వేల మార్కును కోల్పోయి 25,800 స్థాయికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 85,208.76 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై ఇంట్రాడేలో 84,257.14 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సూచీ.. చివరికి 1272.07 పాయింట్ల నష్టంతో 84,299.78 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 368 పాయింట్లు నష్టపోయి 25,810.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 10 పైసలు క్షీణించి 83.80కి చేరింది.

===================

సబ్‌కీ యోజన సబ్‌కా వికాస్‌గా ప్రసిద్ధి చెందిన ప్రజా ప్రణాళిక కార్యక్రమంపై జాతీయ కార్యశాలను కేంద్ర పంచాయితీ రాజ్ శాఖ సహాయ మంత్రి ఆచార్య ఎస్.పి. సింగ్ బఘేల్ ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీకి అవసరమైన నైపుణ్యాలను సిద్ధం చేయడమే ఈ కార్యశాల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

===================

===================